క్లుప్తంగా

సీఎంను కలిసిన డా. బత్తల హరిప్రసాద్



సీఎంను కలిసిన డా. బత్తల హరిప్రసాద్, డా.బత్తల వెంకటరమణ

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా. బత్తల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం తమకు సూచించినట్లు వారు తెలిపారు.

పోలీస్ చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్‌పోస్ట్ వద్ద సూచనలిస్తున్న బీఎస్ఎఫ్ డీఎస్పీ గౌతమ్‌కుమార్

తలుపుల: కదిరి–పులివెందుల రోడ్డుపై బి.కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన నూతన చెక్‌పోస్టును మంగళవారం బీఎస్ఎఫ్ డీఎస్పీ గౌతమ్ కుమార్ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులు, పహారా సిబ్బంది వసతులు, తదితర విషయాలపై ఎస్ఐ దిలీప్‌కుమార్ తో ఆరా తీశారు. సమస్య ఏదైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని బీఎస్ఎఫ్ సిబ్బందికి సూచించారు. ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మాటిచ్చాడంటే చేస్తాడంతే'




పద్మావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీకో సేవా ఉద్యోగులు

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మాటిచ్చాడంటే చేస్తాడంతే అని నిరూపించుకున్నారని ఏపీకో సేవా(కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణికాంత్, లింగాల కరుణాకర్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు ముఖ్యమంత్రి రెగ్యులరైజ్ చేశారని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రెగ్యులరైజన్ ప్రక్రియకు మూడు నెలలుగా కృషి చేసిన హెల్త్ డైరెక్టర్ పద్మావతిని మంగళవారం గుంటూరులో ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ఓడీచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం నల్లగుట్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 104 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కమల్ రోహిత్, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నికి ఆహుతైన ఈతచెట్లు



దగ్ధమైన ఈత చెట్లు

పుట్టపర్తి అర్బన్: ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి సమీపంలో ఈతచెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం అగ్ని కీలలు దావానలంలా వ్యాపించడంతో సుమారు 80కి పైగా ఈత చెట్లు కాలిపోయాయి. వెంకటగారిపల్లి, కప్పలబండకు చెందిన పలువురు అక్కడ ఈత కల్లు, నీరా సేకరించి వ్యాపారం చేస్తుంటారు. ఈత వనం కాలిపోయి జీవనాధారం పోగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: పట్టణంలోని నల్లగుట్ట వీధిలో ఖాజీ సుబహనియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మొదట మసీదులో ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

మాట తప్పని నాయకత్వానికి ఓటేద్దాం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: ఒక్కసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే, అది ఎంత కష్టమైనా అమలు చేస్తారని, మాట తప్పని నాయకత్వానికి ఓటేద్దామని వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన టి.కుంట్లపల్లి మారెమ్మను దర్శించుకొని ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఈసందర్భంగా ఆయనకు మండల ప్రజలు బాణాసంచాతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి 58 నెలల్లో ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు.

1నే పింఛన్ సొమ్ము..

ఈసందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదినే పింఛన్ సొమ్ము అందుకోవాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. 58 నెలల్లో శ్రీసత్యసాయి జిల్లా సాధన, 4 జాతీయ రహదారులు, ఒక ఎక్స్‌ప్రెస్ హైవే, 193 చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమమే కాకుండా, ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న కనెక్టివిటీ రోడ్లు నిర్మించామన్నారు. టి.కుంట్లపల్లి నుంచి తువ్వంకపల్లి, పెస్సానిపల్లి నుంచి కదిరి– తుమ్మల రోడ్డుకు కనెక్టివిటీ రోడ్లు వేయించామని గుర్తు చేశారు. ఇంటింటికీ వెళ్లి తను చేసిన అభివృద్ధిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా బోయ శాంతమ్మను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి , టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సొసైటీ డైరెక్టర్ మధుసూదన్ నాయుడు, సర్పంచులు జగన్‌మోహన్‌చౌదరి, రంగారెడ్డి, బాబా, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి, యూత్ మండల కన్వీనర్ హరినాథరెడ్డి, సీనియర్ నాయకులు బోయపల్లి జనార్దన్‌రెడ్డి, బైరిశెట్టి, వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, టి.కుంట్లపల్లి సచివాలయ కన్వీనర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

టి.కుంట్లపల్లి పంచాయితీలో టీడీపీ ఖాళీ

టి.కుంట్లపల్లి పంచాయతీలో టీడీపీ ఖాళీ అయింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో పంచాయతీకి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టి.కుంట్లపల్లికి చెందిన హోటల్ షేక్ చాంద్ బాషా, అంగడి చంద్రమౌళీనాయుడు, ఉషారాణి, గొల్లపల్లికి చెందిన మాయకుంట్ల శంకరప్ప కుటుంబ సభ్యులు, బసప్పగారి పల్లికి చెందిన ఆంజనేయులు, యల్లప్ప,రెడ్డమ్మ, అశోక్, లీలావతి, పెద్ద రామాంజనేయులు, రమణప్ప, మంజులమ్మ, తులశమ్మతోపాటు దాదాపు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. దుద్దుకుంట వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

నేడు 'దుద్దుకుంట' ఎన్నికల ప్రచారం

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పెనుకొండ రోడ్డు, ఆర్టీటీ ఆఫీస్, బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

తాడిమర్రి: స్థానిక జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీలో మంగళవారం పదో తరగతి పరీక్షలు సజావుగా సాగాయి. మొత్తం 293 మందికి విద్యార్థులకుగాను 27 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు లక్ష్మీదేవి, చెన్నకృష్ణారెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీరాములు, ప్రేమసాగర్ తెలిపారు. పరీక్షలు జరగ్గా పరీక్షకేంద్రాల వద్ద ఎస్ఐ నాగస్వామి పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామసేవలో 'ఈశ్వరమ్మ' విద్యార్థులు



ప్రసాదాలు పంపిణీ చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి అర్బన్: అమగొండపాళ్యం, రాగప్పగారిపల్లితో పాటు వృద్ధాశ్రమాల్లో మంగళవారం పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ ఇంగ్లిషు మీడియం స్కూల్ టెన్త్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సాయి బిడ్డలం వచ్చాం ప్రసాదాలు స్వీకరించండి అంటూ గ్రామస్తులకు పులిహోరా, చెక్కెర పొంగళి, లడ్డూ ప్రసాదాలు, అరటిపండ్లు అందజేశారు. గ్రామ సేవలో తరించడం ఓ మధురానుభూతి నిచ్చిందని సాయి విద్యార్థులు పేర్కొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరమవుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం గుంజేపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ముందుగా సర్పంచ్ సంధ్య శంకర్ ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా పేల్చుతూ ఎమ్మెల్యేని పూల బాటపై నడిపించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రంలో నవరత్నాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మంచి జరిగింటేనే మరోసారి ఆశీర్వదించాలని చెప్పిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసి చూపించారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు.

ధైర్యం లేకనే పొత్తుల కోసం బాబు పాకులాట

చంద్రబాబుకు రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక పొత్తుల కోసం పాకులాడుతున్నాడని కేతిరెడ్డి విమర్శించారు. ఇంత వరకు ధర్మవరం నియోజకవర్గానికి అభ్యర్థిని నిర్ణయించలేకపోతున్నారన్నారు. పొత్తుల్లో భాగంగా సీట్ల సర్దుబాటులో కొలిక్కిరాక తికమకపడే ఇలాంటి పార్టీలు అభివృద్ధి మాత్రం ఏమి చేయగలరని, వీళ్లకు దోచుకోవడం దాచుకోవడం మాత్రమే తెలుసునన్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తుంగలో తొక్కారన్నారు. నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కూటమి పేరుతో వచ్చి ఓట్లు అడిగిన వారిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, ఎంపీటీసీలు తనూష, మల్లికార్జున, నాయకులు భాస్కర్, రంజిత్‌రెడ్డి, సేవే నాయక్, మురళీ, నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

బత్తలపల్లి: ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, ఉప సర్పంచు కోటి గోఫీనాథ్, యువనేత కోటి సురేష్, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, నాయకులు మండల నారాయణ, సాకే గోపాల్, యోగానందాచారీ, వక్కల శంకరయ్య, పామాల రమేష్, నడిమింటి షేక్షావలి, టైలర్ బాబా, బాబ్‌జాన్, వడ్డె ప్రసాద్, జిక్రీయా, సంద్రా రామకృష్ణ, కుమ్మర వెంకటరమణ, ఎస్సీ సెల్ నేతలు ముసలప్ప, కొంకా ప్రసాద్, గవ్వల రమేష్, నాగభూషణ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

తనకల్లు: మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఎస్ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల బతుకులను పూర్తిగా మార్చివేశారన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయన చేస్తున్న అభివృద్ధి నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు జయచంద్ర, రమణ తదితరులు తెలిపారు. నాయకులు చెరుకూరి మధు, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ ఆది, గంగులయ్య, రవీంద్ర, శ్రీనివాసులు, రవి, వెంకటరెడ్డి, కొండయ్య, శ్రీనివాసులు, కిష్టప్ప పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మక్బూల్ అహ్మద్

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక

కదిరి టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డులో మంగళవారం వైఎస్సార్‌సీపీ యువనేత సమీర్‌ఖాన్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన జబీబుల్లా, ఇంతియాజ్‌తో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. చంద్రబాబు మాటలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, నాయకులు పరికి సాధిక్‌బాషా, సాదత్ అలీఖాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 15 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల వద్ద ఉన్న బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీకి చెందిన 15 మంది బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు సైంటిఫిక్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వర్సిటీ యాజమాన్యం పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన సైంటిఫిక్ ఎరెవ్నా సంస్థ ఇటీవల బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. రెండు రౌండ్లు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి మంగళవారం ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్ఎస్ బిలిగి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అత్యాధునిక విద్యను గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంతో ఎంతో మందికి ఉద్యోగావకావకాశాలు లభిస్తున్నాయని ఛాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్, చైర్మన్ భరత్ లాల్ మీనా పేర్కొన్నారు.

బీఎస్ఎఫ్ బలగాల కవాతు



మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీఎస్ఎఫ్ బలగాలు మంగళవారం మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పురవీధుల్లో కవాతు సాగింది. ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచండి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజక వర్గంలోని సరిహద్దు మండలాల్లో చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమడగూరులో రెండు ఓడీచెరువులో ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. మరింత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి నిఘా పెంచాలన్నారు. మోడల కోడ్ ఆఫ్ కండక్ట్, వీడియో వీవీంగ్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్, అకౌంట్ టీంలు సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

గాండ్లపెంట: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎంసీసీ రామానాయక్, తహసీల్దార్ శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన జెండాలు, ఫ్లెక్సీలు, గోడరాతలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో హారతుల ఉత్సవం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం గ్రామంలోని కోట వీధిలో వెలసిన చోళామాంబదేవికి భక్తులు మంగళవారం ఘనంగా హారతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అమరాపురం, మద్దనకుంట, వీరాపురం, బంగారుపాళ్యం, పుల్లీకుంట మహిళలు తమ ఇళ్లలో పిండితో తయారు చేసిన కలశాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న దిన్నెగుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత స్థానిక ఆలయంలో అమ్మవారికి అర్చకుడు శ్రీనివాస్ అభిషేకాలు నిర్వహించి భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

కొల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు కొల్లాపురమ్మను ప్రత్యేకంగా అలంరించారు. అనంతరం విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మడకశిర పట్టణానికి చెందిన అంజికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... హిందూపురం నుంచి మడకశిరకు అంజి ఆటోను తీసుకొస్తున్నాడు. అయితే మడకశిర వైపు నుంచి హిందూపురానికి వెళ్తున్న కారు ప్రమాదవశాత్తూ కల్లుమర్రి సమీపంలో ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ అంజికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో కూడా నుజ్జు నుజ్జైంది. అంజికి వెంటనే మడకశిర ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హిందూపురంకు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నల్లచెరువు: మారిశెట్టిపల్లి వద్ద బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు..ఓరువాయి గ్రామానికి చెందిన రమేష్ మంగళవారం రాత్రి మండల కేంద్రంలో పనులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అయితే మారిశెట్టిపల్లి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గాయపడ్డ వ్యక్తిని బెంగళూరుకు తీసుకెళ్లారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



పెరటి మొక్కలను అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: 'ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు' అని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ తెలిపారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా మంగళవారం జీవీ పాళ్యం గ్రామంలో ఉద్యాన పంటల సాగు, పెరటి తోటల పెంపకంపై రైతులు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణం, ఇంటి పరిసరాల్లో పెరటి తోటల సాగుకు ఆకుకూర విత్తనాలు, పెరటి మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ పెరటి తోటల పెంపకం వల్ల మంచి ఆదాయం పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ఆర్బీకే సిబ్బంది సూచనలు, సలహాలు అందిస్తున్నారని, వారి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



చర్మకారుడికి గొడుగు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని చర్మకారవృత్తి చేసుకుని జీవించేవారికి మంగళవారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎండవేడి నుంచి కాపాడేందుకు గొడుగులను పంపిణీ చేశారు. దాత అసిస్టెంట్ ఇంజనీర్ అమృత సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ రవినాయక్, లక్ష్మీదేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కనగానపల్లి: కనగానపల్లిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రమాదేవి తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షా కేంద్రం వద్దకు బయట వ్యక్తులు రాకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ అరుణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.